క్లుప్తంగా

ఆదోనివాసి దుబాయ్‌లో సురక్షితం



గల్ఫ్ కార్మికుల రక్షణసమితి అధ్యక్షుడు నరసింహతో ఇమ్రామన్

ఆదోని అర్బన్: కర్ణాటక ఏజెంట్ చేతిలో మోసపోయి దుబాయ్‌లో బంధీగా ఉన్న ఆదోనివాసి ఇమ్రాన్ గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి అధ్యక్షుడు గుండెల్లి నరసింహ వద్ద సురక్షితంగా ఉన్నాడు. బాధితుడు శుక్రవారం ఫేస్‌బుక్, వాట్సాప్ ద్వారా సమచారం ఇచ్చాడు. ఇండియాకు పంపేందుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపాడు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

మంత్రాలయం: మండల పరిధిలోని మాలపల్లి గ్రామంలో శనివారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత వై.ప్రదీప్‌రెడ్డి పర్యటించనున్నారు. ముందుగా గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ, వార్డు సచివాలయాన్ని ప్రారంభించి, అనంతరం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు.

సబ్‌కలెక్టర్‌కు ఆహ్వానం

ఆదోని రూరల్: ఈనెల 21న బీసీ ఫెడరేషన్ ఆదోని డివిజన్ కార్యాలయ ప్రారంభోత్సవానికి హాజరుకావాలని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్‌కు బీసీ ఫెడరేషన్ నాయకులు శుక్రవారం ఆహ్వానం పలికారు. సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి ఆయనకు పూలమాల వేసి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరినాయుడు, నాయకులు పాల్గొన్నారు.

రెండు గడ్డివాములు దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కౌతాళం: మండల పరిధిలోని రౌడూరులో శుక్రవారం మధ్యాహ్నం రెండు వరి గడ్డి వాములు దగ్ధమయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మాల హనుమంతప్ప, మాల ఈరన్నలకు చెందిన రెండు గడ్డివాములు పక్కపక్కన ఉన్నాయి. మధ్యాహ్నం గడ్డివాములు నుంచి పొగలు రావడంతో చుట్టుపక్కల వారు గమనించి ఆర్పేందుకు యత్నించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆదోని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చేలోపు రెండు గడ్డివాములు కాలి బూడిదయ్యాయి.

2వ రోజు కొనసాగిన విచారణ

ఆదోని అర్బన్: ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లపై బెట్టింగ్ నిర్వహిస్తున్న నలుగురిని ఐదు రోజుల క్రితం అదుపులోకి తీసుకుని, రూ.80 లక్షలు నగదు, కారు, బైకులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపిన విషయం విధితమే. ఈ మేరకు రెండు రోజుల పాటు విచారణ కోసం త్రీటౌన్ పోలీసులు నిందితులను కోర్టు ద్వారా కస్టడీకి గురువారం తీసుకున్నారు. రెండో రోజు శుక్రవారం నిందితులపై విచారణ కొనసాగింది. వీరి వెనుక ఎవరున్నారు, ఎక్కడెక్కడ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు, ఎవరితో ఆడిస్తున్నారన్న విషయాలపై ఆరా తీసినట్లు డీఎస్పీ శివనారాయణస్వామి, సీఐ నరసింహరాజు, ఎస్‌ఐ పీరయ్య తెలిపారు.

23న సాతనూరులో క్రికెట్ టోర్నీ

కోసిగి: మండల పరిధిలోని సాతనూరు గ్రామంలో ఏరువాక పండుగను పురస్కరించుకుని ఈనెల 23 నుంచి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్స్ తిరుమల, నాగరాజు శుక్రవారం తెలిపారు. గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేల నగదు అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈనెల 22వ తేదీలోగా ఎంట్రీ ఫీజు రూ.1,000 చెల్లించి జట్ల పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9398724948, 8985762957 సంప్రదించాలన్నారు.

ఆర్డీఎస్ నిర్మాణం చేపట్టాలి



మహిళా కూలీలతో సంతకాలు సేకరిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు: ఆర్డీఎస్ నిర్మాణం చేపట్టాలంటూ రాయలసీమ స్టీరింగ్ కమిటీ సభ్యులు ఖాజా, కృష్ణ, మోహన్ కోరారు. రాయలసీమ అభ్యుదయ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాగిమాన్‌దొడ్డి, గంగులపాడు, పెద్దకడబూరు, దొడ్డిమేకల, మేకడోణ, చిన్నతుంబళం, కల్లుకుంట, జాలవాడి, కంబలదిన్ని, హెచ్.మురవణి గ్రామాలలతో పాటు పొలాల్లోని కూలీలు, రోడ్లపై ప్రయాణికులను కలిసి సంతకాలు సేకరించారు. తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు వీరేంద్రగౌడ్‌తో సహా తహసీల్దారు సిబ్బంది సంతకాలు చేసి తమ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, దావీదు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో పోటెత్తిన ఈరన్న క్షేత్రం



వెండి అలంకరణలో స్వామి వారు



స్వామి సన్నిధిలో భక్తుల సందడి



స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న (నరసింహ) స్వామి ఆలయానికి శుక్రవారం వేలాది మంది భక్తులు పోటెత్తారు. అమావాస్య కావడంతో భక్తులు తమ ఇంటి ఇలవేల్పును దర్శంచుకోవాడానికి తరలివచ్చారు. గురువారం సాయంత్రం నుంచే ఆలయానికి చేరుకోవడంతో పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో కిక్కిరిశాయి. స్వామి దర్శనం కోసం గంటకు పైగా సమయం పట్టింది. తెల్లవారు జామున 4 గంటలకు అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. విశిష్ట, ప్రత్యేక, శీఘ్ర, ఉచిత, వీఐపీ దర్శనాల క్యూలైన్లు నిండిపోయాయి. ప్రత్యేక దర్శనం భక్తులకు కూడా గంటకుపైగా వేచిచూడాల్సి వచ్చింది. పిండివంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించుకున్నారు. భక్తుల సౌకార్యర్థం ఆదోని, ఎమ్మిగనూరు, కర్ణాటకలోని రాయచూరు, శిరుగుప్ప, బళ్లారి డిపోలు ప్రత్యేక బస్సులను నడిపారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా కౌతాళం పోలీసులు బందబస్తు నిర్వహించారు.

రామలింగేశ్వర స్వామి ఆలయంలో

మేళిగనూరులో తుంగభద్ర నది ఒడ్డున వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయం శుక్రవారం భక్తులతో కిక్కిరిసింది. అమావాస్య కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అలాగే సుళేకేరి గ్రామ శివారుల్లో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామిని కూడా భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

దర్గాలో అమావాస్య ప్రార్థనలు

కౌతాళం: మండల కేంద్రంలోని జగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గాలో శుక్రవారం అమావాస్య సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తెల్లవారుజామున దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాల అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. సలామ్‌లా ఆలాపన, ఖాదర్‌లింగ స్వామి ప్రవచనలు ఆలపించారు.

సచివాలయ సేవలు విస్తృతం చేయాలి

కౌతాళం: సచివాలయ సేవల్ని విస్తృతం చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం సుళేకేరి సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అనంతరం ఉరుకుంద, చూడి, గుడికంబాలి గ్రామాల్లోని వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చాలంటూ దరఖాస్తు చేసుకున్న రైతుల పొలాలను తహసీల్దారు రామేశ్వర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు.

తాగునీటికి కొరత లేదు



బసాపురం ఎస్ఎస్ ట్యాంకును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ఆదోని టౌన్: వేసవి కాలం దృష్ట్యా ఆదోని పట్టణంలో తాగునీటికి కొరత లేదని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎంఈ నాగభూషణ్‌రెడ్డి, ఏఈలు రాజశేఖర్‌రెడ్డి, కృపాకర్, సిబ్బందితో కలిసి బసాపురం ఎస్ఎస్ ట్యాంకును పరిశీలించారు. ఎస్ఎస్ ట్యాంకులో నెలరోజులకు సరిపడే నీరు నిల్వ ఉందన్నారు. జూన్ మాసంలో వర్షాలు వస్తాయని లేదా తుంగభద్ర జలాశయం నుంచి తాగునీటి నిమిత్తం నీటిని విడుదల చేస్తారని, దీంతో నీటిఎద్దడికి తాగునీటి కొరతే లేదన్నారు. ముందు జాగ్రత్త చర్యగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం ఆర్టీసీ కాలనీలో పార్కు, క్లినిక్ వర్క్‌లను తనిఖీ చేశారు. ఎన్‌జీవోస్ కాలనీలోని ఓవర్‌హెడ్ ట్యాంకు వద్ద మస్టర్ పాయింట్‌ను తనిఖీ చేశారు. సిబ్బంది హాజరుపట్టిక, డ్యూటీలో ఎవరెవరు పాల్గొన్నారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు.

సుందరయ్యకు ఘన నివాళి



ఆదోనిలో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కౌతాళం: పుచ్చపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల సీనియర్ నాయకుడు మల్లయ్య, నాయకులు వలి, ఈరన్న, ఉలిగయ్య కేవీపీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఆదోని రూరల్: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని శుక్రవారం సీపీఎం కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశులు, సీనియర్ నాయకులు మహానందరెడ్డి, పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని స్థానిక బస్టాండ్ ఆవరణంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పరమేష్, కేవీపీఎస్ మండల కార్యదర్శి ఆనందరాజు తదితరులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

వలంటీర్లకు సన్మానం



వలంటీర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కోసిగి: పురస్కారాలకు ఎంపికైన వలంటీర్లను వందనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్త్రీశక్తి సమావేశ భవనంలో ఘనంగా సన్మానించారు. సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలు అందుకున్న వలంటీర్లకు సర్టిఫికెట్, శాలువా, బ్యాడ్జ్ మెడల్స్‌తో పాటు సేవా వజ్రకు రూ.30,000, సేవా రత్నకు రూ.20వేలు, సేవా మిత్రలకు రూ.10,000 నగదు బహుమతిలను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, ఎంపీపీ ఈరన్న, గ్రామ సర్పంచ్ అయ్యమ్మ, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీ మోహన్ రెడ్డి, మండల కన్వీనర్ బెట్టన గౌడ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

- డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య



కేంద్రాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ రామగిడ్డయ్య

ఆదోని టౌన్: నిబంధనల మేరకే ఫెర్టిలిటీ సెంటర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని డీఎంఅండ్ హెచ్‌ఓ రామగిడ్డయ్య ఆదేశించారు. ఏఆర్టీ ఇన్‌స్పెక్షన్ టీం మెంబర్‌లతో కలిసి ఆయన శుక్రవారం పట్టణంలోని ఆదిత్య నర్సింగ్‌హోంలో టెస్ట్ ట్యూబ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎం అండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ అసిస్టెంట్ రీ–ప్రొడెక్టివ్ టెక్నాలజీ (ఏఆర్‌టీ) అండ్ సరోగసీ యాక్ట్–2021 నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకున్నారని, పూర్తి స్థాయిలో పరిశీలించిన తర్వాతే సర్టిఫికెట్ జారీ చేస్తామన్నారు. రిజిస్ట్రేషన సర్టిఫికెట్ కూడా ఐదేళ్లకోసారి రెన్యూవల్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రేడియాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ రాధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరానగర్ అర్బన్‌హెల్త్ సెంటర్ తనిఖీ

స్థానిక ఇందిరానగర్ అర్బన్‌హెల్త్ సెంటర్‌ను డీఎం అండ్‌హెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సెంటర్ పరిధిలో జరుగుతున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు.

కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలి

ఆదోని రూరల్: ఉపాధిహామీ చట్టం పరిరక్షణ కోసం ఈనెల 22వ తేదీన కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ముట్టడి కార్యక్రమానికి కూలీలు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.లింగన్న కోరారు. శుక్రవారం పాండవగల్లు, కొత్తూరు గ్రామాల పరిధిలో జరుగుతున్న ఉపాధి పనుల వద్దకు వెళ్లి కూలీలతో ఆయన మాట్లాడారు.

బనవాసి వద్ద జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్

- 21న బ్రోచర్ ఆవిష్కరణ
- కుడా వైస్ చైర్మన్ భార్గవ్ తేజ్



మాట్లాడుతున్న కుడా వైస్ చైర్మన్ భార్గవ్‌తేజ్

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరు, ఆదోని మున్సిపాలిటీల పరిధిలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, మధ్య తరగతి ప్రజల కోసం మండలంలోని బనవాసి వద్ద రాష్ట్ర ప్రభుత్వం జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ ఏర్పాటు చేస్తున్నట్లు కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, కుడా వైస్ చైర్మన్ భార్గవ్ తేజ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు, రూ.18లక్షల్లోపు సంవత్సర ఆదాయం ఉన్న మధ్య తరగతి ప్రజల కోసం ప్రభుత్వం మండల పరిధిలోని బనవాసి వద్ద హైవేకు ఆనుకొని 110 ఎకరాల్లో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేస్తోందన్నారు. ఇప్పటికే టౌన్‌షిప్‌కై అన్ని రకాల అనుమతులు తీసుకోవడం జరిగిందని, ఆ భూమిలో 1100ల ప్లాట్లు వేస్తున్నామని చెప్పారు. అందులో 3, 4, 5 సెంట్ల విస్తీర్ణంలో ప్లాట్లు వేసి ప్రభుత్వం నిర్దేశించిన ధరకు విక్రయించడం జరుగుతుందని తెలిపారు. ఆయా టౌన్‌షిప్ ప్లాట్ల బ్రోచర్లను ఆదివారం ఎమ్మిగనూరులోని సోమప్ప మెమోరియల్ హాల్‌లో విడుదల చేస్తామని, ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డితో పాటు ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్దన్‌రెడ్డి హాజరవుతారన్నారు. అదే రోజు నుంచి ఆన్‌లైన్లో ప్లాట్ల బుకింగ్ ఉంటుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్లాట్ల ధరలో 20 శాతం, పెన్షనర్లకు 5 శాతం రాయితీ ఉంటుందని తెలిపారు. డిప్ ద్వారా ప్లాట్లు కేటాయించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్లాట్‌ను కొనుగోలు చేసే వారు ఒకేసారి నగదు మొత్తం చెల్లిస్తే వారికి 5 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. సమావేశంలో స్థానిక, ఆదోని మున్సిపల్ కమిషనర్లు గంగిరెడ్డి, రఘునాథ్‌రెడ్డి, కుడా ప్లానింగ్ ఆఫీసర్ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీ వేరుశనగ విత్తనాలు మంజూరు

మంత్రాలయం రూరల్: మండలానికి రాయితీ వేరుశనగ విత్తనాలు మంజూరైనట్లు వ్యవసాయ అధికారి జీరా గణేష్ శుక్రవారం తెలిపారు. 50 క్వింటాళ్ల వేరుశనగ, 5 క్వింటాళ్ల పిల్లిపెసర, 8 క్వింటాళ్ల జీలగ విత్తనాలు మంజూరైనట్లు తెలిపారు. వేరుశనగ విత్తనాలు 40 శాతం, పిల్లిపెసర, జీలగలను 50 శాతం రాయితీతో ప్రభుత్వం రైతులకు అందజేస్తున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, సెల్ నంబర్‌ను తీసుకుని రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వేరుశనగ 30 కిలోల బస్తా ధర రూ.2970 కాగా రాయితీ రూ.1116 పోనూ రైతు రూ.1674 చెల్లించాలన్నారు. 10 కిలోల జీలగ విత్తనాల ధర రూ.790 కాగా రాయితీ రూ.395 పోనూ రైతు చెల్లించాల్సింది రూ.395, పిల్లిపెసరు 8కిలోల ప్యాకెట్ ధర రూ.970 కాగా రాయితీ రూ.485 రైతు రూ.485 చెల్లించాలన్నారు.

నిబంధనలు పాటించండి

మంత్రాలయం: వాహనదారులు తప్పకుండా రోడ్డు నిబంధనలు పాటించాలని సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ వేణుగోపాల్‌రాజు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని చిలకలడోణ, చెట్నేహళ్లి, కల్లుదేవకుంట గ్రామ శివారులో నిత్యం ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి బారికేడ్లు ఏర్పాటు చేశారు. వాహనాలు నడిపే సమయంలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించాలని సూచించారు. అనంతరం పలు వాహానాలను తనిఖీ చేసి రికార్డులు సక్రమంగా లేని వారికి జరిమానా విధించారు.

గుండెపోటుతో హమాలీ మృతి

ఆదోని రూరల్: సెంట్రల్ వేర్‌హౌస్ హమాలీ బి.చంద్ర(38) శుక్రవారం గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సీఐటీయూ నాయకులు బి.మహానందరెడ్డి, బి.తిప్పన్న, పీఎస్ గోపాల్ తదితరులు చంద్ర మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట



శివనారాయణ స్వామి, డీఎస్పీ

ఆదోని అర్బన్: అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయనున్నట్లు డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి మైకు ఏర్పాటు చేయాలని, మెయిన్ రోడ్డులో ట్రాఫిక్ సిగ్నల్స్ మరమ్మతులు చేయించాలని, మరమ్మతులకు గురైన సీసీ కెమెరాలను బాగు చేయించాలని, నాలుగు ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసేందుకు ఎనిమిది హైక్వాలిటీ సీసీ కెమెరాలు కావాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డికి ప్రతిపాదనలు పెట్టామన్నారు. కొన్నిచోట్ల వన్‌వే పెడుతున్నామని, గతంలో ఎలా ఉన్నాయో వాటినే పునఃరుద్ధరిస్తామని చెప్పారు. రాత్రివేళలో పశువులను వదలకుండా చర్య లు తీసుకుంటామన్నారు.

రోడ్ల పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు



మాట్లాడుతున్న ఆర్‌అండ్‌బీ ఎస్‌సీ ఆర్.నాగరాజు

ఆలూరు: జిల్లాలో టెండర్లు పూర్తయిన నేషనల్ హైవే, ఆర్‌అండ్‌బీ రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ ఆర్ నాగరాజ్ తెలిపారు. హొళగుంద, సులువాయి, మార్లమడికి, ఎల్లార్తి, కోకిలతోట, వివిధ మండల కేంద్రాల్లోని పీహెచ్ కేంద్రాలు, కేబీ 167 రోడ్డు పనులను శుక్రవారం పరిశీలించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆదోని మండలం ధనాపురం గ్రామం నుంచి హొళగుంద మండల కేంద్రం వరకు మంజూరైన రూ. 65 కోట్ల రోడ్డు పనులను కాంట్రాక్టర్‌చే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. 9 పీహెచ్ కేంద్రాలలో రోగులకు 5 నుంచి 8 బెడ్స్ రూంల నిర్మాణానికి ఒక్కో పీహెచ్‌సీకి రూ.9 లక్షలను ఖర్చు చేయనున్నట్లు వెల్లడించారు. ఆలూరులో నూతనంగా అతిథి గృహాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం రూ. 3 కోట్లతో టెండర్లును పిలిచిందని తెలిపారు. డీఈ వెంకటేశ్వర్లు, ఆదోని ఏఈ రవి కుమార్ తదితరులు ఉన్నారు.

చెక్‌బౌన్స్ కేసులో జైలుశిక్ష

ఆదోని రూరల్: ఎమ్మిగనూరు పట్టణం శారదా స్కూల్ ప్రాంతానికి చెందిన ఎం.కాశీంవలికి ఆదోని కోర్టు చెక్‌బౌన్స్ కేసులో ఎనిమిది నెలల జైలుశిక్ష విధించినట్లు న్యాయవాది రషీద్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఎం.కాశీంవలి కాంట్రాక్టర్‌గా పనిచేస్తూ ఆదోని పట్టణానికి చెందిన గురురెడ్డి వద్ద 2016లో రూ.11.50 లక్షలు అప్పు తీసుకున్నాడు. అప్పు చెల్లించేందుకు ఇచ్చిన చెక్కులు బ్యాంకులో బౌన్స్ కావడంతో గురురెడ్డి కాశీంవలిపై కేసు వేశారు. దీనిపై ఆదోని సెకండ్ అడిషినల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ వీరవెంకటనాగలక్ష్మి విచారించి ముద్దాయిపై నేరం రుజువు కావడంతో ఎనిమిది నెలల జైలుశిక్షతో పాటు రూ.11.50 లక్షలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు న్యాయవాది రషీద్, పోలీసులు తెలిపారు.

శనీశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో శనీశ్వరస్వామి



మంగరాయ సన్నిధిలో శనిదోష పరిహార పూజలు చేస్తున్న పండితుడు

ఆదోని అర్బన్: పట్టణంలో శుక్రవారం శనీశ్వర స్వామికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాధవరం రోడ్డులోని రాయనగర్‌లో వెలిసిన శనీశ్వరస్వామికి వేకువజాము నుంచి పంచామృతాభిషేకం, తైలాభిషేకం, మహామంగళ హారతితో ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

మంగరాయ సన్నిధిలో..

పట్టణ శివారులోని మంగరాయ సన్నిధిలో శనీశ్వర జయంతి సందర్భంగా ఆలయ మేనేజర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో దోషపరిహార పూజలు జరిగాయి. శనీశ్వరస్వామి విగ్రహానికి భక్తుల సమక్షంలో వేదపండితుడు గరుడాద్రి దత్తాత్రేయశర్మ శాంతి హోమం, తైలాభిషేకం నిర్వహించారు. ముందుగా మంగరాయ ఆంజనేయస్వామి వారికి ఫల పంచామృతాభిషేకం, అలంకరణ, నైవేద్యం, మహామంగళహారతితో పూజలు చేశారు. అనంతరం శనిదోష పరిహార పూజలు జరిగాయి.

కోసిగి రైల్వే గేటు వద్ద గందరగోళం

- గూడ్స్ రైలు రాకతో గేట్ వేసిన సిబ్బంది
- గంటన్నర పాటు ట్రాఫిక్ జామ్
- ట్రాఫిక్ క్లియర్ కాక ముందే మరో రైలు రాక
- మధ్యలో ఇరుక్కున్న ప్రయాణికులు
- సిబ్బంది అప్రమత్తతతో తప్పిన ప్రమాదం



ట్రాఫిక్ క్లియర్ కాకమునుపే మరో రైలు రావడంతో గేట్ల మధ్యలో నిలిచిపోయిన వాహనాలు, ప్రయాణికులు



ప్రయాణికుల పక్క నుంచే వెళ్తున్న ప్యాసింజర్ రైలు

కోసిగి: మండల కేంద్రం కోసిగి రైల్వే గేటు వద్ద శుక్రవారం గందగోళం చోటుచేసుకుంది. అమావాస్య పర్వదినం కావడంతో కౌతాళం మండలం ఉరుకుంద ఈరన్న స్వామి దర్శనార్థం భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం 9 గంటల సమయంలో గూడ్స్ రైలు రాకతో అక్కడి సిబ్బంది గేటు వేశారు. దాదాపు 20 నిమిషాల తర్వాత గూడ్స్ రైలు వెళ్లాక గేటు తెరిచారు. ఈక్రమంలో గేటుకు ఇరుపక్కల ఉన్న వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోవడంతో దాదాపు గంటన్నర సేపు ట్రాఫిక్ జామ్ అయ్యింది. అంతలోనే ప్యాసింజర్ రైలు రావడంతో గేటు వేసేందుకు సిగ్నల్ పడింది. గేట్ మెన్ గేటు వేసేందుకు యత్నించినా పట్టాల మధ్య భారీ వాహనాలు నిలిచిపోయాయి. గేట్ మెన్ గేటు వేసేందుకు నానా కష్టాలు పడ్డారు. మధ్యలో కాలినడకన వెళ్లే ప్రయాణికులు కూడా ఉండడంతో గేట్ మెన్ అప్రమత్తమై ప్యాసింజర్ రైలును ఆపేశారు. వాహనదారులను ఎక్కడికక్కడే నిలబెట్టి, కాలినడకన వెళ్లే వారిని జాగ్రత్తగా పక్కకు పంపి రైలును ముందుకు కదిలించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాగా కోసిగి రైల్వే స్టేషన్ మీదుగా చెన్నై– ముంబయి ప్రధాన రైల్వే మార్గం కావడంతో రోజుకు దాదాపు 80 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రతి 20 నిమిషాలకు ఒకసారి గేటు వేస్తున్నారు. గేటు సమస్యతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల రాకపోకల కోసం ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

- రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి
- సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్



ఏరియా ఆస్పత్రిలో ఓపీ విభాగంలో రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్

ఆదోని టౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్లు అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సబ్‌కలెక్టర్ అభిషేక్‌కుమార్ సూచించారు. శుక్రవారం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరుగుతున్న నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌లకు సూచించారు. ఓపీ విభాగంలో రోగులు పదుల సంఖ్యలో చీటీల కోసం వేచి ఉండడం, అవసరమైన మేరకు సిబ్బంది లేకపోవడం ఏమిటని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్లు అందరూ హాజరయ్యారా, ఎవరైనా గైర్హాజరయ్యారా అని ఆరా తీశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వారం క్రితం జిల్లా కలెక్టర్ ఆస్పత్రిని తనిఖీ చేసి బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్ల దుస్థితిపై అసహనం వ్యక్తం చేశారని, వీలైనంత త్వరగా బాత్‌రూమ్, లెట్రిన్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. చిన్నచిన్న ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులు వైద్యం కోసం ఆస్పత్రికి వస్తే.. కర్నూలు రెఫర్ పేరుతో కొంతమంది డాక్టర్లు సొంత క్లినిక్‌లకు రెఫర్ చేసుకుంటున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయని, పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.